క్లుప్తంగా

సేవలోనే సంతృప్తి



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న సిరి సహస్ర

కొమ్మాది: యాంత్రికమైన జీవనశైలిలో సేవతోనే సంతృప్తి లభిస్తుందని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర (సిరమ్మ) అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి రామయోగి అగ్రహారంలోని శ్రీ సద్గురు సేవాశ్రమంలో వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి ఇల్లాపు వెంకట్ నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు పండ్లు, రొట్టెలు, చీరలు, పంచెలు, అందజేశారు. భోజనాలు ఏర్పాటు చేశారు. మంచి వాతావరణంలో ఆశ్రమం నిర్వహిస్తున్న యోగా రాజును ఆమె అభినందించారు. కార్యక్రమంలో సుధాకర్, నాగేశ్వరరావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గీతం ఫార్మసీ కళాశాలకు జాతీయ గుర్తింపు

కొమ్మాది: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్‌ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్)– 2025 సంవత్సరం ర్యాంకింగ్‌ల పట్టికలో 33వ స్థానం సంపాదించిందని గీతం ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. రాజా ప్రభు తెలిపారు. బోధన, పరిశోధనలలో పాటిస్తున్న అత్యున్నత ప్రమాణాలకు ఈ గుర్తింపు లభించిందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే నాక్ ఏజీజీ గ్రేడ్‌తో పాటు క్యూఎస్ ఆసియా విశ్వవిద్యాలయ ర్యాంకింగ్‌ను, ఎన్‌బీఏ ర్యాంకింగ్‌ను సాధించిందని తెలియజేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట



ఉత్సవరాట వేస్తున్న స్థానికులు

తగరపువలస: తగరపువలస ప్రైవేట్ మార్కెట్ ఎదురుగా కటకం బాబులు ఖాళీ స్థలంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు బుధవారం రాట వేశారు. శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయ అర్చకుడు ఏడిద కార్తీక్‌శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

• భీమిలి మండలం తాటితూరు రెడ్డివీధిలోనూ దేవీ నవరాత్రి ఉత్సవాలకు రాట వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం కొత్త మూలకుద్దు ఎస్సీ కాలనీ రెల్లివీధిలో పైడితలమ్మ ఆలయ రెండో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పైడితల్లమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో గణనాథుడు



తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ రామాలయం వద్ద మండపంలో కొలువుదీర్చిన గణేశుడిని బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు సామూహిక విష్ణు సహస్రనామం పారాయణం చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 4 వేల మందికి అన్నదానం చేశారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధా రణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

ముందుకు కదలని మురుగు



రోడ్డుపక్కన నివాసాల సమీపంలో నాచు పట్టిన మురుగు నీరు

వర్షం పడితే ఆ ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. కొందరు తమ అవసరాల కోసం ప్రధాన కాలువలను కప్పేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఆక్రమణలపై దృష్టి సారించి, పూడికలు తొలగిస్తే తప్ప మురుగు సాఫీగా ప్రవహించదు. ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితిలో మార్పు రాకపోగా మరింతగా దిగజారుతోంది.

- నిల్వ నీటిలో పేరుకుపోయిన నాచు
- సమీప ప్రాంతాలకు వ్యాధుల ముప్పు
- వర్షం వస్తే చెరువుల్లా రోడ్లు
- పట్టించుకోని అధికారులు

భీమునిపట్నం: పారిశుధ్యం మెరుగుకు అందరూ సహకరించాలని.. దోమలు వ్యాప్తి చెందకుండా ఇళ్లల్లో నీరు నిలువ ఉండకూడదని పదేపదే ప్రచారాలు చేసే అధికారులు కంటిముందు పెద్ద ఎత్తున మురుగు నీరు నిలిచి ఉన్నా పట్టించుకోకపోవడంతో పరిసర ప్రాంతాల వారు రోగాలబారిన పడుతున్నారు. మరోవైపు రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు, పాదచారులకు అవస్థలు తప్పడం లేదు.

ప్రధాన కాల్వలు కప్పేయడంతో..

భీమిలి నుంచి తగరపువలస వెళ్లే మార్గంలో వుడా మైదానం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా విశాలమైన మురుగునీటి కాలువలు ఉన్నాయి.ఈ చుట్టుపక్కల ప్రాంతానికి ఇవే ప్రధాన కాలువలు. దీంతో నివాసాల నుంచి వచ్చే నీటితో పాటు వీటికి ఆనుకుని ఉన్న గెడ్డల నుంచి వర్షాలు పడే సమయంలో వీటి నుంచే నీరు వెళ్లేది. గతంలో ఇక్కడ ఎటువంటి ఇబ్బందులు ఉండేవికావు. కానీ కొన్ని సంవత్సరాల క్రితం ఈ రెండు కాలువలను కొందరు తమ అవసరాలకు కప్పేశారు. దీంతో కాలువలు మూసుకుపోయాయి.



కాలువలు సరిగ్గా లేక నీరు రోడ్డుపైకి రావడంతో చెరువులా మారిందిలా..

దుర్గంధం.. దోమలు

ఇలా ఇరువైపులా కాలువలు మూసుకుపోవడంతో మురుగు నీరు పూర్తిగా నిలిచిపోతోంది. దీంతో చెరువులా మారిన నీటిపై నాచు, పిచ్చిమొక్కలు, దుప్పలు ఏర్పడడంతో పెద్ద మడుగులా ఉంటోంది. దీనివల్ల తీవ్రమైన దుర్వాసనతో పాటు దోమల బెడద తీవ్రంగా ఉంటోంది. ముఖ్యంగా వీటి దగ్గరలోని అంబేడ్కర్ కాలనీలో నివాసాల వద్దకు ఈ నీరు వెళ్లి నిలిచిపోతోంది. దానివల్ల అక్కడ నివాసాల్లో ఉండే వారికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీని వల్ల అంటువ్యాధులు, దోమల సమస్య చాలా ఎక్కువగా ఉందని వీరు ఆందోళన చెందుతున్నారు. రానురాను ఈ సమస్య తీవ్రరూపం దాలుస్తోంది.



వర్షాల సమయంలో రోడ్డు పక్కన నిలిచిపోయిన నీరు



వర్షం నీటితో నిండిపోయిన మైదానం

త్వరలో పరిష్కరిస్తాం



నీరు నిలిచిపోతున్న వుడా మైదానం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తాం. ఏ విధంగా పనులు చేయిస్తే సమస్య పరిష్కారం అవుతుందో చూసి, ఆ దిశగా త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

–ఒమ్మి అయ్యప్ప నాయుడు, జోనల్ కమిషనర్, భీమిలి

చెరువుల్లా రోడ్లు

భారీ వర్షాలు పడే సమయంలో పెద్ద ఎత్తున రోడ్డుపైకి నీరు వచ్చేయడం మరో సమస్యగా ఉంది. ఇక్కడ కాలువలు సరిగ్గా లేకపోవడంతో కాలువల నుంచే కాకుండా చుట్టుపక్కల గెడ్డల నుంచి వచ్చేనీరు కూడా తోడవడంతో నీరు భారీగా రోడ్డుపైకి వచ్చేస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పక్కనే ఉన్న వుడా మైదానంలోకి నీరు ఎక్కువగా రావడంతో, కొద్ది రోజుల పాటు దీన్ని వినియోగించుకోలేని పరిస్థితులు ఉంటున్నాయి. ఇక్కడ సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తీస్తే చాలావరకు సమస్య పరిష్కారమవుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేషన్ డిపోలు సమయానికి తెరవక అవస్థలు



ఆర్డీవో కార్యాలయంలో డీటీ సుధాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

భీమునిపట్నం: భీమిలి, తగరపువలస పరిధిలోని పలువురు రేషన్ డిపో డీలర్లు సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సీపీఐ నాయకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పద్ధతి ప్రకారం అన్ని డిపోలు ఉదయం నుంచి సాయంత్రం వరకు, నిర్దేశించిన సమయాల వరకు తెరిచి ఉంచి, సరకులను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ వారు తమకు నచ్చిన విధంగా వ్యవహరిస్తూ, దుకాణాలను సరిగ్గా తెరవకపోవడంతో సరకులు తీసుకునేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వారు కచ్చితంగా సమయపాలన పాటించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ కూడా సరిగ్గా జరిగేలా చూడాలని కోరుతూ డీటీ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల నర్సింహులు, మావూరి వీర్రాజు, ఇమంది అప్పారావు పాల్గొన్నారు.

ఆత్మహత్యలకు మానసిక ఒత్తిళ్లే కారణం



గండిగుండంలో అవగాహన కల్పిస్తున్న వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు

తగరపువలస: ఆత్మహత్యలకు మానసిక ఒత్తిళ్లే కారణమని వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు తెలిపారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం గండిగుండం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. యువత, వృద్ధుల్లో ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎవరైనా ఒంటరిగా, నిస్సహాయులుగా ఉన్నట్లు అనిపిస్తే వారికి అండగా నిలవాలని కోరారు. మానసిక సమస్యలు ఉన్నప్పుడు దాచి పెట్టుకోకుండా, కుటుంబ సభ్యులు, స్నేహితులతో మనసు విప్పి మాట్లాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

నానో యూరియాతో మంచి ఫలితాలు



నానో యూరియా గురించి వివరిస్తున్న వ్యవసాయాధికారులు

తగరపువలస: నానో యూరియా వినియోగం వలన పంటకు అవసరమైన పోషకాలు ఆకుల ద్వారా అందుతుందని వ్యవసాయశాఖ భీమిలి ఏడీ బి.విజయ ప్రసాద్ తెలిపారు. విత్తిన 25 నుంచి 35 రోజుల మధ్య నానో యూరియా వినియోగించి, పంట పూతకు వచ్చే సమయంలో రెండోసారి పిచికారి చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం టి.నగరపాలెం, తాటితూరు పంచాయతీలలో రైతులకు ఆత్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నానో యూరియాపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎకరాకు బస్తా యూరియా వేయడానికి రూ.500 ఖర్చు, మూడు గంటల సమయం పడుతుందన్నారు. డ్రోన్ ద్వారా సమయం, కూలి ఖర్చులు ఆదా అవుతాయన్నారు. భీమిలి ఏవో బి.శివకోమలి మాట్లాడుతూ వాతావరణం, నేల నుంచి పంటకు అవసరమైన పోషకాలు గ్రహించి మొక్కలకు అందించే జీవుల సముదాయాన్ని జీవన ఎరువులు లేదా బయో ఫర్టిలైజర్లు అంటారన్నారు. కార్యక్రమంలో శిరిగుడి ఈశ్వరరావు, పతివాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్వాంటం కంప్యూటింగ్ హ్యాక్‌థాన్ సెమీ ఫైనల్స్



కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ వీసీ రాజశేఖర్

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాదిలోని జీవీపీ కళాశాలలో అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్ రౌండ్ పోటీలు బుధవారం జరిగాయి. ఈ పోటీలను ఏయూ వీసీ రాజశేఖర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో క్వాంటం టెక్నాలజీ ప్రాధాన్యాన్ని వివరించారు. పోటీల్లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పలు టీమ్‌లు పాల్గొని, నైపుణ్యం ప్రదర్శించాయి. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.5వేలు నగదు పురస్కారాలను పరిశ్రమల ప్రతినిధుల సహకారంతో అందజేశారు. విజేతలు ఈ నెల 13న నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న గ్రాండ్ ఫినాలేకు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమల అధిపతులు డాక్టర్ వి.మహేశ్వరరావు, సంజయ్ చిట్బోరే, ఏపీఎస్‌సీహెచ్‌ఈ మోడరేటర్ ధనుంజయరావు పాల్గొన్నారు.

డీడీవోగా పదోన్నతి పొందిన ఎంపీడీవోకు సత్కారం



విజయకుమార్‌ను సత్కరిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు

పద్మనాభం: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డీడీవోగా పదోన్నతి పొందిన పద్మనాభం ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ ఆయన్ను దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రామస్వామి నాయుడు పాల్గొన్నారు.

మితిమీరుతున్న ఆకతాయిలు

రద్దీ సమయంలో హైవేపై కారు డోర్లు తెరుస్తూ విన్యాసాలు



హైవేలో రద్దీ సమయంలో కారు డోర్లు తెరుచుకుని విన్యాసాలు చేస్తున్నారిలా..

మధురవాడ: మధురవాడలో మందుబాబులు, ఆకతాయిల చేష్టలు మితి మీరుతున్నాయి. కొందరు తప్ప తాగి, మరికొందరు సరదా కోసం చేస్తున్న విన్యాసాలు మిగిలిన వాహన చోదకులకు ఇబ్బందిగా మారుతున్నాయి. బుధవారం సాయంత్రం జాతీయ రహదారిపై ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది. మధురవాడ నుంచి కొమ్మాది మీదుగా కొందరు ఆకతాయిలు కారు డోర్లు తెరుచుకుని, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ మిగిలిన వాహనచోదకులను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ ఘటన మధురవాడ–కొమ్మాది సిగ్నల్ పరిసర ప్రాంతాల్లో జరిగింది. సిగ్నల్స్ వద్ద చిన్న చిన్న కేసుల కోసం ఫొటోలు తీయడంలో నిమగ్నం అయిపోతున్న ట్రాఫిక్ పోలీసులు ఇలాంటివి పట్టించుకోకపోవడంతో మిగిలిన వాహనచోదకులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

21 మద్యం బాటిళ్ల స్వాధీనం

తగరపువలస: ఆనందపురం మండలం ప్రకృతివానిపాలెంలో స్థానిక పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సత్తిబాబు అనే వ్యక్తి పాన్‌షాపుపై బుధవారం దాడిచేసి 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సత్తిబాబు బయట మద్యం దుకాణాల వద్ద కొనుగోలు చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

బాల్యం నుంచే మంచి నడవడిక అలవరుచుకోవాలి



మొక్కలు నాటుతున్న షాలిని మీనన్

కొమ్మాది: విద్యార్థులు బాల్యం నుండే మంచి నడవడిక అలవరుచుకోవాలని యూనియన్ బ్యాంక్ జోనల్ అధికారి షాలిని మీనన్ సూచించారు. తద్వారా ఉన్నత స్థితికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నప్పటి నుంచి మంచి అలవాట్లు కలిగి, క్రమశిక్షణతో మెలుగుతూ బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగాలన్నారు. విద్యార్థులకు అవినీతి రహిత సమాజ నిర్మాణం పట్ల అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ సింహాచలం, ప్రిన్సిపాల్ డా. వైఎస్ఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

తగరపువలస: ఆనందపురం మండలం చందక పంచాయితీలో శ్రీసత్యసాయి సేవా సంస్థల ద్వారా 45 రోజుల పాటు శిక్షణ పొందిన 45 మంది మహిళలకు జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎస్. నాయుడు బుధవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. భవిష్యత్తులో ఆసక్తి గల మరింత మంది మహిళలకు ఈ శిక్షణ ఇప్పిస్తామన్నారు. జిల్లాలో విస్తృతంగా ఆధ్యాత్మిక సేవా కార్య క్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.ఈశ్వరి, ఆర్.ఎ.నాయుడు, బి.సాయికుమార్, టి.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నియామకాలు

చందక భజన మండలి కన్వీనర్‌గా బంక వెంకటరావు, జాయింట్ కన్వీనర్‌గా రెడ్డి రాము, యూత్ కో–ఆర్డినేటర్‌గా రెడ్డి రమేష్, గ్రూప్ లీడర్‌గా లో లుగు రాజు, మహిళా కో–ఆర్డినేటర్‌గా రెడ్డి గౌరి నియమితులయ్యారు. అనుబంధ కమిటీల ప్రతినిధులుగా చందక సునీత, రెడ్డి ధనలక్ష్మి, బి.వి.లలిత, రెడ్డి వరలక్ష్మి, రెడ్డి పైడినాయుడులను నియమించారు.

వాహనదారులే గోతులు పూడ్చారు..

పిల్లలు పడిపోవడంతో గుంతలు కప్పిన మిత్రబృందం



వుడా కాలనీ జంక్షన్ వద్ద నెలల తరబడి ఉన్న గుంతల్లో సిమెంట్ మిశ్రమం వేస్తున్న తాతారావు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు కార్‌షెడ్ జంక్షన్–మిధిలాపురి వుడా కాలనీ జంక్షన్ మధ్యలో ఉన్న పెద్ద గోతుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం కూడా అదే పరిస్థితి నెలకొంది. ఆ మార్గంలో పాఠశాలకు వెళ్తున్న సమయంలో వాహనం వెనుక సీటులో కూర్చున్న విద్యార్థులు, ఆ గతుకుల వద్ద కింద పడిపోయారు. దీన్ని గమనించిన చంద్రంపాలెం గ్రామానికి చెందిన వాహనదారులు నాగోతి తాతారావు, అతని మిత్రులు వెంటనే స్పందించి అందుబాటులో ఉన్న రాళ్లతో గుంతలు పూడ్చారు. సిమెంట్, ఇసుక మిశ్రమం వేసి కప్పారు. ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టిన వారిని పలువురు అభినందించారు.

దివ్యాంగులందరికీ పెన్షన్లు పునరుద్ధరించాలి

తగరపువలస: మండలంలోని దివ్యాంగులు అందరికీ పెన్షన్లు పునరుద్ధరించాలని ఆనందపురం మండల దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కొత్తలంక దేవుడు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో జానకికి బుధవారం వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల మండలంలోని 26 పంచాయతీలలోని దివ్యాంగులకు రీ వెరిఫికేషన్ పెట్టి సదరం క్యాంపులు నిర్వహించారన్నారు. గత నెలలో వీరికి పర్సంటేజీ తగ్గించి నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఈ నోటీసులు రద్దు చేసి అందరికీ పెన్షన్లు వచ్చేలా చూడాలన్నారు. 2010 నుంచి అమలులో ఉన్న సదరం సర్టిఫికెట్ల ఆధారంగా పెన్షన్లు కొనసాగించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో దివ్యాంగుల మహిళా అధ్యక్షురాలు పి.కనకమహలక్ష్మి, కార్యదర్శి వై.అప్పలకొండ ఉన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి అధికారి పరిశీలన

- ఇటుకల కోసం తవ్విన గోతుల్లో ఫార్మా వ్యర్థాలు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో తనిఖీలు



తాటితూరులో స్థానికుల నుంచి వివరాలు తీసుకుంటున్న ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సూర్యకళ

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో నివాసాలను ఆనుకుని వ్యవసాయ భూముల నుంచి 20 అడుగులకు పైగా మట్టిని తీసి, ఆ గోతులను ఫార్మా వ్యర్థాలతో నింపుతున్నారని ఇటీవల ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సూర్యకళ బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సమస్యపై ఇటీవల గోపిశెట్టి గోవిందరావు తదితరులు కలెక్టర్, భీమిలి రెవెన్యూ, మైనింగ్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో పరిశీలనకు వచ్చిన ఏఈ దృష్టికి స్థానికులు పలు సమస్యలను తీసుకువెళ్లారు. చింతపల్లి రమణ, ఆదినారాయణ, అప్పలరాజు, మురళి, సాయి అనే వ్యక్తులు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా, ఇటుకల మట్టి కోసం లోతైన గోతులు తీస్తున్నారని, ఆ గోతుల్లో పశువులు చిక్కుకుని మరణిస్తున్నాయని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం డాక్టర్ రెడ్డీస్ ఫార్మా సంస్థ నుంచి అనకాపల్లి జిల్లా రేబాక తరలించాల్సిన వ్యర్థాలను ఇక్కడ గోతులు పూడ్చడానికి వినియోగిస్తున్నారని తెలిపారు. మూడు రకాలైన ఫ్లై యాష్‌ను రహదారి పక్కన గుట్టలుగా వేసేస్తున్నారని, దీనివల్ల వేసవిలో ఆ మార్గంలో ప్రయాణించేవారి కళ్లలో ధూళి పడుతుండగా.. వర్షాలు కురిసినప్పుడు బురదగా మారి, వాహనదారులు జారిపడుతున్నారని తెలియజేశారు. బట్టీలు కాల్చేటప్పుడు పొగ, రేణువుల వలన కళ్ల మంటలు కలుగుతున్నాయన్నారు. ఫార్మా వ్యర్థాలు, ఫ్లై యాష్ కారణంగా ఏడాది పొడవునా చుట్టుపక్కల పంటలు పాడైపోతున్నాయని, తాగునీరు కలుషితం అవుతుందని తెలియజేశారు. ఈ గోతుల కారణంగా తన లే అవుట్‌లో భారీ ప్రహరీ కూలిపోయిందని గోవిందరావు వాపోయారు. కొంతకాలంగా తాము ఫిర్యాదు చేస్తున్నా, బట్టీల యజమానులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీంతో ఆమె గోతిలో నీరు, మట్టి నమూనాలు తీసుకుని వెళ్లారు. రహదారి పక్కన ఫ్లై యాష్ నిల్వలను చూసి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ ముఖ్య నాయకులు ఉండబట్ల చిన్నారావు, శిరిగుడి శ్రీనివాసరావు, మద్దిల గురునాయుడు తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.



మట్టి తవ్వి ఫార్మా వ్యర్థాలతో పూడుస్తున్న గొయ్యి